అయ్యో!

నా పేరు రామారావు. నా వయసు ఇరవయి ఆరు. ఒక్కసారి యిటు ఆలకించండి.

"ఆడదై పుట్టే కన్నా అడవిలో మ్రానై పుట్టటం మేల"ని మా నాయనమ్మ దగ్గర నుండి మా ఆవిడ వరకు అప్పుడప్పుడు సణుగుతూ వుంటారు. అక్కడికి మగాడేదో సుఖపడి పోతున్నట్లు.

# మగాడి గోడు

*సి. భారతి

ఎప్పుడైనా మా ఆవిడతో బజారుకు వెళ్ళానను కోండి. వచ్చినా పర్సు తీసుకురాదు. ఆవిడ పళ్ళు కొన్నప్పుడు నేను డబ్బు చెల్లించి పళ్ళు బాగా ఉన్నాయో లేదో చూసి మరీ బాగ్‌లో సర్ది ఆ బాగ్ నేను చేత బట్టుకుని నడవాలి. తను పక్కగా ఎనిమిది నెలల బాబిగాడి నెత్తుకుని వాడిని చూసుకుంటూ, మురుసు కుంటూ నడుస్తుంది.

మల్లే పువ్వుల దుకాణం దగ్గర ఆవిడ నిలబడితే నేను పువ్వులు కొనాలి. ఎన్ని కావాలో ఆవిడను అడిగి తీసుకుంటే మంచిది. లేకపోతే ఎక్కువనో, తక్కువనో సాధిస్తుంది. ఒక్కొక్కసారి దేవుడి పటానికి పెద్ద దండ కావాలంటుంది. అలాగే కాబోలని యింకోసారి తీసుకుంటే "దేవుడికి మాత్రం రోజూ దండలు వేస్తామా" అని చిరాకు పడ్తుంది.

బట్టల షాపు కెళ్తామా... ఇక నా నడుము నొప్పి పుట్టి, కాళ్ళు గుంజుకు పోయి, తలనొప్పి వచ్చినా సెలక్షను తెగదు. పైగా 'ఈ మగాళ్ళతో బట్టల షాపుకి రాకూడదు' అని విసుగు.

"రిక్షాకి ఎంత యిచ్చారు" అంది ఒకసారి బజారు నుంచి వచ్చిన తరువాత.

"నాలుగు రూపాయిలు" అన్నాను.

"ఏమిటీ నాలుగు రూపాయిలా! ఇక మనం సంసారం చేసినట్టే. కాస్త వెనకా ముందూ చూసుకోవద్దూ ... అలా గుమ్మరించి వేయటమేనా?" ఆవిడ కామెంట్- నేను సంచులతో రూపాయిలు ధారపోస్తున్నట్లుగా. మరోసారి కార్పెంటరు వచ్చి యింట్లో చిన్న రిపేరు పని చేసి వెళ్ళాడు.

మామూలుగానే "ఏమండీ! ఎంత యిచ్చారు అతనికి?" అంది. గత అనుభవం జ్ఞాపకం వుంచుకుని పది రూపాయిలు యిచ్చిన వాడిని తగ్గించి చెప్పి "ఐదు" అన్నాను.

వెంటనే "ఏమిటండీ మీకు మరీ ఇంత పిసినారితనం. రెండు మైళ్ళ దూరం నుంచి వచ్చాడా? వాడు బతకొద్దా! మనం సంపాయించేది యిలాంటి కష్టజీవుల కష్టంతోనా?" అంది. నేను దిమ్మెర పోయాను.

"ఏమండీ చీరలు అద్దకానికి యివ్వాలి" అంది ఒకరోజు.

"ఇవ్వు" అన్నాను.

"విజయాటాకీస్ ప్రక్క సందులో వేస్తారటండీ'

"అయితే నువ్వే వెళ్ళి యిచ్చిరా ప్రతిసారీ నీతో బజారు రావటం నాకెక్కడ కుదురుతుంది? పైగా ఆఫీసులో ఇన్‌స్పెక్షను జరుగుతోంది" అన్నాను.


"విజయా టాకీస్ ఎక్కడండి?"

"మూడేళ్ళ నుంచి ఈ వూళ్ళో వుంటూ కనీసం పది రోజుల కొకసారైనా బజారుకు వెళ్తావ్, విజయా టాకీస్ తెలియదా?"

"మీరు ప్రక్కన వుండగా నేనేమీ గుర్తు పెట్టుకోనండి" అంది.

ఇప్పుడర్థమయిందాండి మగవాడి కష్టం!?

ఈ ఆడవాళ్ళు బజారులు, సందులు గుర్తు పెట్టుకోరు. దేనికైనా మగాడు అఘోరించాల్సిందే.




టి.వి.లో హిందీ ప్రోగ్రాంలు వస్తాయి కదా! నేను యింట్లో లేనప్పుడు సీరియల్స్ అన్నీ చూసి కథ, డైలాగులతో సహా అన్నీ చెప్తుంది. కాని నేను యింట్లో వుండి అదే సమయంలో టి.వి. చూస్తే ఆవిడకు ట్రాన్స్‌లేటరుగా పని చేయాల్సిందే. నాకు చిరాకు పుట్టి "నువ్వు కూడా మధ్యమ హిందీ పరీక్ష ఫస్టు క్లాసులో పాసయి పటం కట్టి మరీ అట్టే పెట్టుకున్నావు కదా. ఇప్పుడు నన్ను అడగుతావేంటి" అంటాను.

"మీరు ప్రక్కనుండగా ఆ హిందీ జాగ్రత్తగా వినటం ఎందుకు లెండి! మీరే చెప్తారుగా!" అంటుంది.

ఇదీ వరస. మగవాడు ప్రక్క నుంటే చెవికి, బుద్ధికి కూడా పని చెప్పరన్నమాట ఆడవాళ్ళు!

ఏ విషయం అయినా సరే మగవాణ్ణి "ఏమిటి? ఎందుకు?" అని విసిగించేస్తారు. అది మనకి సంబంధించని విషయమైనా సరే. వీడు అన్నీ తెలుసుకుని సర్వజ్ఞుడు కావాల్సిందే.

ఏదైనా "తెలియదు" అన్నామా 'ఇంతేనా?' అన్నట్లు మొహం పెడ్తారు. ఆడవాళ్ళకి ఏమీ తెలియక పోయినా ఫరవాలేదు.

మా ఆవిడే కాదు, మా నాయనమ్మ వుంది. తాతగారు ఎప్పుడైనా కాస్త విశ్రాంతిగా కూర్చుని వుంటే చాలు, తాతగారు ఎప్పుడో స్నేహితుడి అప్పుకోసం హామీ వుండి అందుమూలంగా కొంత డబ్బు నష్టపోయిన విషయం చెప్తుంది. పాపం... తాతగారు ఆస్తి పాడు చెయ్యలేదు. కాని పెంచలేదు. అదీ నాయనమ్మ కినుక. ప్రపంచంలో అందరూ ఒక్కలాగ వుండరు కదా! కొందరు ఆస్తులు సంపాదించుకుంటారు. కొందరు ఇళ్ళు కట్టుకుంటూ వుంటారు... అది వాళ్ళ అవకాశాన్ని బట్టి వుంటుందని నాయనమ్మ చచ్చినా నమ్మదు.

మా పక్కింటి వాళ్ళు పొలం కొనుక్కున్న శుభ సందర్భంగా మా తాతగారు "ఒరే రావుడూ నీ దగ్గరకు వచ్చి ఒక నెలరోజులు వుంటానురా!" అన్నారు. నేను నాయనమ్మని తీసుకురమ్మని చెప్పలేదు.ఒకసారి ఇద్దరూ వచ్చి మా ఇంట్లో వున్నప్పుడు నాయనమ్మకు తీరిక ఎక్కువై రోజూ తాతగారిని సాధించేది. చివరకు మా ఆవిడకు కూడా తాతగారి మీద జాలి వేసింది. సాధారణంగా నాయనమ్మ అటువంటి మూడ్‌లోకి వచ్చినప్పుడు మా వూళ్ళో అయితే తాతగారు బయటకు వెళ్ళి కాలక్షేపం చేసి వచ్చేవారు. ఇక్కడ కొత్త చోటు కావడంతో నాయనమ్మకు బాగా వీలుచిక్కేది.

మా నాన్నగారి విషయం కూడా అంతే.

"ఇవాళ శ్రావణ శుక్రవారం" అంటుంది అమ్మ.

నాన్నగారు బజారుకి వెళ్ళి పూజకు కావాల్సిన సమస్త సామాగ్రి తెచ్చి ఇంట్లో వుంచాల్సిందే. నాకు 'ఏమిటి ఈ అన్యాయం' అనిపిస్తుంది. బజారుకెళ్తే ఆ రోజే అందరికీ అవసరం కదా అని మూడు రూపాయిల వస్తువు పది రూపాయిలు చెప్తారు. అయినా కొని తీసుకురావాల్సిందే. ఏమిటి ఈ చాదస్తం! ఇంకో రోజు పూజ చేసుకోకూడదా!

నాకు కూడా చిన్నప్పుడు ఈ అన్యాయం తెలిసేది



కాదు. ఏదైనా పండగ వస్తే కాళ్ళు, చేతులు విరగ్గొట్టుకుని మా చెల్లికి పూలు కోసిచ్చేవాడిని. అది దర్జాగా పట్టు పరికిణీ కట్టుకుని, పూలు పెట్టుకుని తిరిగేది. కొంచెం సరదాకి ఏమైనా అంటే చాలు "అమ్మా అన్నయ్య చూడవే" అన్న ఫిర్యాదుతో ఇంటిల్లిపాది "ఆడపిల్లను ఏడిపిస్తావెందుకురా" అంటూ నా మీద దండెత్తేవారు.

అసలు ఆడపిల్ల అయితే ఏమిటి? ఎందుకు అంత సుకుమారం? చిన్నప్పుడల్లా అన్నదమ్ములు 'సేవ' చెయ్యాలి. పెళ్ళయితే మొగుడుంటాడు కదా! ఆ పిచ్చి వాడికి తప్పదు.

తలనొప్పి అంటే టాబ్లెట్ కోసం పరుగెత్తాల్సిందే. బజారుకి వెళ్ళాలంటే రిక్షానో, ఆటోనో ఇంటికి తెచ్చి జీ హుజూరనాలి. కాస్త నీరసం అంటే డాక్టరు దగ్గరకు తీసుకువెళ్ళి మందిప్పించి తీసుకురావాలి. పక్కింటి వాళ్ళు ఏ వస్తువైనా కొనుక్కుంటే అవసరం లేక పోయినా మనం కూడా తెచ్చి ఇంట్లో పడెయ్యాలి. ఇలా చెప్పుకు పోతే ఎన్నో... ఇదంతా 'షివ్రీ' కిందకి వస్తుంది-ట! హతోస్మి!

మన దగ్గర బంధువులకి జబ్బు చేసిందని కబురు వచ్చిందా ఇక చచ్చామే. ఇంట్లో వున్న ఆడాళ్ళంతా శోకాలు మొదలుపెడ్తారు. ముందు వీళ్ళను ఊరుకోబెట్టేసరికి తల ప్రాణం తోకకి వస్తుంది. తరువాత మన తిప్పలు సరేసరి. అసలు వార్త సరిగా వుండదు. అనారోగ్యం ఎవరికో, ఏ హాస్పిటల్లో వున్నారో కనుక్కుని రైల్లోనో, బస్సులోనో, ఆటోలోనో వీళ్ళని హాస్పిటల్ చేర్చిన తరువాతే మనం ఊపిరి పీల్చుకునేది. అందురూ హాస్పిటల్ కి ఎందుకు, కబురు తెలుసుకుని వస్తామంటే కుదరదే! అటువంటి సమయంలో, అటువంటి సమయం ఏమిటి- ఎటువంటి సమయం అయినా వాళ్ళ మాటే నెగ్గాలి.

మగాడంటే డబ్బు సంపాదించే యంత్రంలా, అలసట ఎరుగని మహానుభావుడిగా, అన్ని విషయాలు తెలిసిన సర్వజ్ఞుడిలా వుండాలి ఆడవాళ్ళ దృష్టిలో. వాళ్ళకు ఏమి తెలియకపోయినా ఇబ్బంది లేదు. ప్రక్కన మగాడుంటాడు కదా! వాడే అన్నీ చూసుకుంటాడు.

ఇవన్నీ ఒక ఎత్తు. ఎప్పుడూ మంచి బట్టలేసుకుని టిప్‌టాప్‌గా సినిమా హీరోలాగ వుండాలనడం ఒక ఎత్తు. ఎప్పుడూ వాళ్ళకి నచ్చిన బట్టలు వేసుకోవాలి. ఇదే చచ్చిన చావు. ఎవ్వని చెప్పాలి?

అదిగో మహాతల్లి పిలుస్తోంది. వాళ్ళ చెల్లెలి పెళ్ళికి ప్రజంటేషన్ కొని ఆవిడను వాళ్ళ వూరు తీసుకువెళ్ళి తెలియని వాళ్ళతో సహా కలుపుగోలుగా మాట్లాడాలట. అబ్బ... అమ్మ... ఈ మగాడై పుట్టే కన్నా ఎడారిలో మంచినీళ్ళ చెలమై పుడ్తే పదిమంది దాహానికన్నా ఉపయోగపడే వాణ్ణికదా!